# కోరిక

"అమ్మా సినిమాకు వెళ్ళాలి. డబ్బు కావాలమ్మా" అంటూ మురళి గదిలోకి వచ్చాడు.

అడుగుపోయిన 'ట్రంకు'లోని బట్టలు అన్నీ తీసి క్రింద పెట్టి "ఏ చీరైనా కాస్త బాగుందా" అని చూసుకుంటూంది జానకమ్మ.

భర్త అఫీసుకి వెళ్ళిపోతూ పనివేళా పిల్చి మరీ చెప్పాడు. "సాయంత్రం అయిదున్నరకల్లా రెడీగా వుండు. సినిమాకి వెడదాం" అని.

ఎన్ని సంవత్సరాలు అయిందో సినిమా చూసి. ఇద్దరూ పిల్లలనీ తీసుకువెడితే ఎంతలేదన్నా ముప్ఫైరూపాయలకి తక్కువ కాదు. పోనీ తమరిద్దరూ వెళ్ళినా అయిదారు రూపాయలకి పైమాటే. అసలే జీతం చాలక ఖర్చు లెక్కువైనాయని ఆరురూపాయలు "పనిమనిషికి ఎందుకు దండుగ" అని మాన్పించేసి నెలంతా కష్టపడుతూంటే ఒక్కరోజు రెండు గంటల సరదాకోసం భర్త అయిదురూపాయలు ఖర్చు చేస్తానంటే జానకమ్మకి చాలాకోపమే వచ్చింది.

"ఏమిటీ ఈరోజు వింత" అంది వచ్చేకోపాన్ని అణుచుకుంటూ-

భార్య మనస్సులోని భావాలని పసికట్టిన రామ్మూర్తి నవ్వుతూ మరేం చెప్పకుండా "వెళ్ళాలి అంటే వెళ్ళాలి అంతే" అంటూ వెళ్ళిపోయాడు.

పిల్లలని అందరినీ వదిలి తను ఒక్కర్తీ వెళ్ళటానికి మనస్సులో బాధగావున్నా ఆయన ఎందుకు అడిగారో .... "సరే ఈ బాధలన్నీ జీవితాంతం వుండేవేగ" అనుకుని తనకి తను సరిపుచ్చుకుని సాయంత్రం పనులన్నీ చకచకా పూర్తి చేసుకుంటూవుంటే మూడో ఆడపిల్ల జ్యోతీ, చిన్నకొడుకు గోపీ గుసగుస లాడుతున్నారు.

"అరే అన్నాయ్, నాన్నారూ అమ్మా విచిత్ర కుటుంబం సినీమాకి వెడుతున్నారు రా" అని.

జానకమ్మకి నవ్వూ వచ్చింది, కోపమూ వచ్చింది. అయినా వాళ్ళమీద కోపం ఎందుకు, తరచుగా వెడుతూ వుంటే వాళ్ళకి అసలు వింతగా కన్పించనే కన్పించదుగా అనుకుంటూ వున్నచీరెల్లో కాస్త మంచిది యెంచి ఇవతల పెట్టుకునేందుకు చూస్తూంటేనే కొడుకువచ్చి "సినీమాకి డబ్బు కావాలమ్మా" అంటూ నిల్చున్నాడు.

"ఈ నెలలో ఇప్పటికి ఆరు అయినాయి చాలలేదూ" అంటూ విసుక్కుంది గాని, మరుక్షణంలో కొడుకు ఎక్కడ కించపడతాడో అని-

"సరేలే వెళ్ళు...ఇదిగో ఈ అయిదు కాగితం తీసుకు వెళ్ళి కావలసింది తీసుకుని మిగతాది తీసుకువచ్చేయి"

అంటూ చీరె మడతల్లోని నోటుతీసి అందించింది. సినిమా పేరు వింటూనే మూడోకూతురు-

"అమ్మా అన్నయ్యతో నేనూ వెడతానే" అంటూ ఏడుస్తూ వచ్చింది.

"చూడమ్మా ఇదీ, ఇంతకు ముందు లెక్కలతో కుస్తీ పడుతోందల్లా శివంగిలా ఎలా లేచివచ్చిందో! వెళ్ళు వెళ్ళు నెలాఖరు డబ్బెక్కడిది" కసిరికొట్టాడు చెల్లెలిని.

"పాపం నీకైతే ఇవేవీ వుండవు. నా దగ్గరికి వచ్చేసరికే..." మూతి ముడుచుకు వెళ్ళిపోయింది రేఖ.

"దాన్ని అలా కసిరి కొడతావుగాని నీవీరోజు వెళ్ళకపోతే ఏమో" అని గట్టిగా కేకవేయాలని అన్పించినా మింగేసి వూరుకుంది.

"అమ్మా చిల్లర ఇప్పుడే తేనా, అసలే టైములేదు. సైకిల్‌లో వెళ్ళటానికే ముప్పావుగంట పడుతుంది. నీవేం దిగులుపడకు టిక్కెట్టు డబ్బుతప్ప మరో నయాపైస ఖర్చు చెయ్యను.

మురళి గబగబా బూటు వేసుకుంటూ అంటూంటే నెలరోజులక్రితం పురుటికి వచ్చిన పెద్దకూతురు అన్నపూర్ణ తమ్ముడివైపు కొరకొరా చూస్తూ "పాపం నయాపైసా ఖర్చు పెట్టవు. టికెట్టు దొరక్కపోతే మాత్రం అయిదురూపాయలూ పెట్టి కొనేస్తావు. డబ్బు విలువ తెలుసుకోకపోతే ఎలాగురా. అమ్మ ప్రతి నయాపైసా ఎంత జాగ్రత్తగా ఖర్చుచేస్తోంది. ఎంత కష్టపడుతోందీ అర్థం చేసుకుంటున్నావా" మురళికి చిర్రెత్తుకొచ్చింది.

"పాపం అది తెలిసేకదూ బావగారు 'మీరు పెట్టిన బట్టలు నాకకర్కలే'దని విసిరికొట్టి వెళ్ళినప్పుడు ఏడ్చి శోకాలు పెట్టి 'సూటుబట్ట' కొనిపించారే అప్పుడే మయిందమ్మా ఈ కబుర్లన్నీ"

అక్కకీ తమ్ముడికీ ఘర్షణ మొదలైంది.

'అబ్బబ్బ' ఏమిట్రా! ఇద్దరూ, నోరు మూసుకు ఘారుకోండి.

"మురళీ జాగ్రత్తగా వెళ్ళిరా" అంటూ కసిరి తను వెతుక్కున్న చీర కన్పించక-

"అమ్మాయ్, నా ఎర్రచీర ఏదే" అంది పెద్దకూతుర్ని వుద్దేశించి.

అన్నపూర్ణకి కళ్ళనీళ్ళు నిండుకుండలయాయి. ఏం జవాబిస్తుంది! ఎలాగైనా అమ్మకి పెద్దకొడుకంటేనే ప్రేమ. డబ్బులేదంటూ కాలేజీలో ఎందుకూ చేర్చటం. యస్సల్సీ పాసై ఎంతమంది బ్రతకటంలా. కాలేజీలో చేరినదగ్గరనించీ మురళి మరీ బరితెగించాడు. ఇంట్లో అందరిమీదా అథారిటీ పెద్దతనే కాలేజీ స్టూడెంటు నని! కచ్చగా అనుకుంటూ తల్లికి జవాబివ్వకుండానే అక్కడనించి వెళ్ళిపోయింది.

ఇంక అన్నపూర్ణ కోపం మూడురోజుల వరకూపోదు. మురళి అయినా బాధ్యత తెలియక ప్రవర్తించడు.

వాడు నోరు తెరిచి "నా కిది కావాలమ్మా" అన్నది తను ఎలాగైనాసరే ఇచ్చేస్తుంది. సంసారపరిస్థితులు బాగా లేక కుదించుకోవటంకాని, పిల్లలకి అన్నీ అమర్చాలనీ, కోరిన సినిమాకల్లా వెంటతీసుకుని భర్తతోసహా వెళ్ళాలని తనకి వుండదూ? కానీ ఏం ప్రయోజనం. క్రియలో చూపలేదు గనుక తనలోవున్న ఆపేక్షపిల్లలు ఏం అర్థం చేసుకుంటారు"

జానకమ్మ ముఖాన బొట్టు పెట్టుకుందామనీ, ముడివేసిన జుత్తు విప్పి కాస్త అందంగా 'సిగ' చుట్టుకోవాలని పిన్నుల కోసం ఇల్లంతా వెతుక్కుంది-చివరికి పాత ఆడినసామానులో దొరికాయి. అదైనా రేఖ తెచ్చింది.

జానకమ్మకి నవ్వూ కోపం రెండూ వస్తున్నాయి తన సంసార పరిస్థితికి. పగిలి పోయిన అద్దం ముందు పెట్టుకుని బారెడు జుత్తూవిప్పి అద్దంలో పాపిడి తీసుకుంటూంటే అక్కడక్కడా వెండితీగల్లా మెరుస్తూ పైపైకి వచ్చేస్తూన్న తెల్ల వెంట్రుకలు జానకమ్మని వెక్కిరించాయి-

"నువ్వింక ముసలిదానివై పోతున్నావులే" అన్నట్లు,

'నీ ముఖం నవ్వెందుకూ! ఆరోజుకారోజు పైబడి అల్లుడొచ్చేసి మనవడో, మనవరాలో పుట్టబోతూంటే పెద్దదాన్ని కాక చిన్నదాన్ని ఎలా అవుతాను' అంటూ సణుక్కుందే కాని గబగబా దువ్వుకుని ముడి చుట్టుకోలేకపోయి అద్దంలోని తన ముఖాన్ని అలాగే చూస్తూవుంటే పదిహేడు సంవత్సరాల క్రితం కాపురానికి వచ్చిన కొత్తలో భర్తా తనూ ఎంత ఆనందంగా గడిపారు. ఎన్ని సినిమాలు చూశారు. ముస్తాబు

అవుతూ అద్దంలో ఈ ముఖాన్నే ఎంత గర్వంగా చూసుకునేది! నిజంగా అప్పుడు ఎంత బాగుంది.

జానకమ్మ ఆలోచనలు ఇరవై సవత్సరాల వెనక్కి పరుగుతీశాయి.

## 2

జానకి కాపురానికి వచ్చిన కొత్తలో రామ్మూర్తి ఆరుగంటలు కాకుండానే ఇంటిదగ్గర వాలేవాడు. అప్పుడే జానకి వున్న చీరెల్లో మంచిది కట్టుకుని పనంతా పూర్తిచేసుకుని జడ అల్లుకుంటూ వాకిట్లోకి తొంగి చూసేది. రెండే గదుల ఇల్లు. భూతలస్వర్గంలా వుండేది జానకికి. ఆ రెండు గదులూ నీట్ గా సర్దివుంచేది.

రామ్మూర్తి వస్తూ తెచ్చిన కనకాంబరాల మాల తనే జానకి తలలో తురుముతూంటే, సిగ్గుపడిపోతూ-

“ఛీ... పాడు. మగాళ్ళెక్కడన్నా ఇలాంటి పనులు చేస్తారేమిటి” అనేది.

“వూ.... దీనిలోని ఆనందం నీకేం తెలుసు. చూడు, ఇప్పుడు ఎంత బాగున్నావో” అంటూ తనవైపుకి బలవంతంగా తిప్పుకున్నాడు.

“అబ్బబ్బ వుండండీ ... పువ్వులు నలిగిపోతాయి” చేత్తో పువ్వులని సరిచేసుకుంటూ మరో చేత్తో భర్తనిదూరంగా వుండమని ప్రాధేయపడింది.

"నలిగితే ఫర్వాలేదు.. ఊ" అతని కళ్ళు ఏదో కావాలని మారాం చేస్తున్నట్లుంటే గ్రహించీ గ్రహించనట్లు-

"ఇంక కాఫీ, టిఫినూ అక్కర్లా, ఆఫీసు బట్టలు మార్చేదిలేదూ" చిరుకోపం ప్రదర్శించింది.

"ఉ హూ! కడుపు నిండిపోయింది నా దేవతని చూసే సరికి" అంటూ దగ్గరగా అతి దగ్గరగా వచ్చేశాడు.

"కడుపునిండితే చాలామంచిదే. ఈ నెలనించీ డబ్బంతా ఆదాచేసి ఆ డబ్బుతో ఎంచక్కా స్కూటర్ కొనుక్కుని దానిమీద ఇద్దరం రివ్వున వెళ్ళిపోదాం. అలా వెడుతూంటే ఎంత బాగుంటుందీ, భలేబాగుంటుంది కదండీ."

స్కూటర్ వెనక భర్త నడుంచుట్టూ చెయ్యివేసి గాలికి ఎగిరిపోయే పమిటని గట్టిగా పట్టుకుంటున్నట్లు అనుభూతి చెందుతోంది జానకి.

"ఇదిగో యిలా చూడండి"

అంటూ పెట్టెతీసి ఓ చిన్న "కుండ" తీసి చూపించింది.

"నాన్నగారు మొన్న వచ్చినప్పుడు నా కిచ్చిన పది రూపాయలూ దీనిలో వేశాను. ఈ నెలనించీ పనిమనిషి, చాకలి వగైరా ఖర్చులు కట్-అది లెక్కవేసి ఆ డబ్బు దీనిలో వేసేస్తాను, ఏమంటారు" మెరుస్తున్న కళ్ళతో భర్త ముఖంలోకి చూసింది.

రామ్మూర్తి ముఖం నల్లగా అయిపోయింది. మంచి సైకిలే కొనుక్కోగల స్తోమతులేక సెకండ్ హాండ్ సైకిల్‌తో కాలక్షేపం చేస్తున్న తను ఈ జీవితం అంతా కూడబెట్టినా అయిదు వేలుపెట్టి స్కూటర్ కొనగలడా!

అంతలోనే ఓ ఆశాకిరణం తళుక్కుమంది. ఆఫీసులో తనే కష్టపడి పనిచేసేది ఆఫీసర్ కూడా గౌరవంగా చూస్తాడు. భగవంతుడు దయతలచి త్వరలో ప్రమోషన్ వస్తే ... కాస్త కాస్త కూడబెట్టి కొనుక్కోవచ్చు. అవును ప్రయత్నించాలి- గట్టి నిశ్చయంతో తనూ ఏమేమి అనవసరం ఖర్చులు చేసేదీ ఓసారి పరిశీలించి చూసుకుని అవి తగ్గించేయాలని కృతనిశ్చయుడై -

"సరే టిఫిను పెట్టు. అలా సినిమాకి వెడదాం" అంటూ బట్టలు మార్చుకుంటుంటే జానకి "తప్పా, సినిమాకి కాదు పార్కుకి వెడదాం. హాయిగా చల్లగాలి, త్వరగా ఇంటికి రావచ్చు- డబ్బు ఆదాచేసి కుండలో వెయ్యవచ్చు" ముక్కు మీద వేలువుంచి అన్నది.

"ఆఁ .... అవును ... కదూ! .. అబ్బ నీ ఆలోచనలు అమోఘం. ఇండియాకి ఆర్థిక మంత్రిణిగా నిన్ను వేస్తే...."

ఇద్దరూ బిగ్గరగా నవ్వుకుని పార్కుకి బయలుదేరి నడుస్తూంటే జానకి కళ్ళన్నీ ఏ స్కూటర్ వెడుతున్నా దాని మీదే నిల్చేవి. జంటలు జంటలుగా వెళ్ళిపోయే వాళ్ళని కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ వుండిపోయేది. భర్తముందుకు వెళ్ళి జానకి రాలేదని గ్రహించి చెయ్యిపట్టుకుని లాగితేగాని ఈ లోకంలోకి వచ్చేదికాదు.

ఇంక రాత్రి తెల్లవార్లూ అందమైన కలలుకంటూ నిద్రపోయేది. ఇలా ఒక్క రెండునెలలు కూడా గడవలేదు. కాలేజీ చదువుకి మరిది, ఉద్యోగం ప్రయత్నం కొరకు ఆడబడుచు కొడుకూ వచ్చారు. వీరిద్దరూ కాక అత్తగారి మేన

ల్లుడి ఆరోగ్యం బాగాలేదు. పెద్దాసుపత్రిలో మందు తీసుకోవాలని ఆరు నెలలు తిష్టవేశాడు.

జానకి మొదటి కాన్పుకి పుట్టింటికి వెళ్ళిపోయింది భర్తని వదలలేక వదిలి.

'ఇంత త్వరలో ఎడబాటుః అందులో దాదాపు ఆరు నెలలు ... అబ్బ' అనుకుంది అయిష్టంగా. కాని తప్పదుగా.

# 3

భరించరాని ప్రసవవేదన అనుభవించి ఆ పైన పండులాంటి కొడుకుని చూసి, మురిసిపోయి అంతక్రితం అనుభవించినవన్నీ మర్చిపోయి భర్త రాకకోసం ఎదురు చూస్తుండగానే, టెలిగ్రాం అందుకుని రామ్మూర్తి రెక్కలు కట్టుకుని భార్య దగ్గర వాలాడు. కొడుకుని చూసుకుని మురిసిపోయాడు.

“నీ పోలికే అంటే మీ పోలికే” అని అర్థగంట వాదులాడుకున్నారు భార్యాభర్త లిద్దరూ.

“మూడోనెల రాగానే వచ్చేయాలి సుమా” అంటూ మరీ మరీ చెప్పి వెళ్ళిపోయాడు.

తల్లిదండ్రులు “అయిదవ నెలవరకూ వుండమ్మా” అంటున్నా, “ఒక్క క్షణంకూడా వుండను” అని మురళిని ఎత్తుకుని భర్తదగ్గరికి వచ్చేసింది.

అప్పటికే అక్కడ రిటైర్ అయిన మామగారూ, అత్తగారూ, మిగతా ముగ్గురూ “షరా” మామూలే. ఒక్క

క్షణంకూడా తీరుబడి లేకుండా అస్తమానం పని, పని. పని.

రామ్మూర్తి ఠంచన్ గా ఆరు కొట్టకుండానే ఇల్లు చేరేవాడు. కాని అర్థగంట తర్వాతగాని దర్శనం అయేది కాదు.

ఇదివరలా వాకిట్లో తనకోసం ఎదురుచూస్తూ వుండ నందుకు చికాకు ముంచుకొస్తూంటే "మారిపోయింది, బొత్తిగా మారిపోయింది" అనుకునేవాడు కచ్చగా.

చేతిలోపని పూర్తిచేసుకుని గదిలోకి వచ్చిన జానకి-ఆఫీసు బట్టలన్నా మార్చకుండా మంచానికి అడ్డుగా పడు కున్న భర్తనిచూస్తూనే-

"అరే ఎంతసేపయిందీ వచ్చి నే చూడనేలేదు! బట్టలు మార్చుకు రండి. టిఫెను అసలే చల్లారిపోయింది" అంటూ వంట ఇంట్లోకి వెళ్ళబోయిన జానకిని పమిట పట్టుకుని లాగి కసిగా-

"దేవిగారికి ఇప్పటికి దయకలిగిందా ! నేను త్వరగా ఇంటికి వచ్చేది ఎవరికోసం ? రెండుగదుల ఇంట్లోనే బాగుంది. ఎప్పుడూ కన్పించేదానివి.చాలదని పెద్ద ఇల్లు తీసు కుంటే తమరి దర్శనమే దుర్లభమవుతున్నది. నే నెన్నిసార్లు చెప్పాను నేను వచ్చేసరికి నువ్వు ఎదురుగా వుండాలని!"

"ఏం చెయ్యమంటారు.నాకుమాత్రం అలా వుండాలని వుండదూ? వంటకావాలా? మామగారికి జావా, అత్తగారికి ఫలహారం, మనకి వంటా, జ్వరం వచ్చిన మీ తమ్ముడికి 'బన్ రొట్టె' కాల్చటం! ఇవన్నీ వీడు నిద్రపోతున్నప్పుడు

కాకపోతే, లేచాడంటే చస్తే చంకదిగడు. పొద్దుటినుంచీ కాళ్ళులాగుతున్నాయి ఏం చెయ్యను. ఈ గొడవ వున్నదేగా రండి టిఫెన్ తింటూ కబుర్లు చెబుతురుగాని" చెయ్యి అందించి "లేవండి" అంటూ బ్రతిమిలాడుతుంటే-

"ఇంతకీ అమ్మా నాన్నగారూ వగైరా ఎక్కడికి వెళ్ళినట్లు ?"

"ఎవరో స్వాములవారు వచ్చారుట, దర్శనానికి వెళ్ళారు. మీ తమ్ముడు ఆసుపత్రికీ, మేనల్లుడు క్లబ్బుకీ, పొద్దున వచ్చిన దూరపుచుట్టం వూరు చూడటానికీ"

రామ్మూర్తి మళ్ళీ నోరు తెరిచే పనిలేకుండా గడగడా చెప్పేస్తుంటే కోపం ఎగిరిపోయి పెద్దపెట్టున నవ్వు వస్తున్నా ఆపుకుంటూ, "నేను టిఫెను తినను. తిననంటే తినను తినను కాక తినను" అంటూ దిండులో తలదూర్చే భర్తమీద జాలీ, కోపం ముప్పిరిగొనగా-

"నాకింక బ్రతిమిలాడే శక్తిలేదు స్వామీ. మీరు మంచివారు. చాలా చాలా మంచివారు, దయచేయండి శ్రీవారు. అయ్యయ్యో 'స్టవ్' మీద కూర మాడుకంపు కొడుతూందే అంటూ పరుగుతీసింది జానకి."

రామ్మూర్తి పెద్దగా నిట్టూర్చాడు.

ఏం జీవితం. ఎన్నో కలలు కని కనీ పెళ్ళి చేసుకుంటే ఒక్క నెలన్నా, ఒకే ఒక్క నెలన్నా హాయిగా, ఆనందంగా గడపలేదు. ఇంకమరిరావేమో ఆరోజులు ! జానకిలో అంత హుషారూ ఎక్కడ పోయిందో, ఎప్పుడూ బాధ్యతల బరు

పుతో కృంగిపోతోంది. ఇలా అయితే ఎప్పటికి తెల్లవారు తుంది. భగవాన్ ... ఇంటికి పెద్దకొడుకుగా పుట్టించకు సప్తజన్మలకీ.

రిటైరయిన తండ్రి, చదువు పూర్తికాని తమ్ముడు. పెళ్ళి అయినా తన బాధ్యతలు పుట్టింటివారిమీద వదిలే అక్కగారు ఏమిటో మొన్నటికి మొన్న అక్క వచ్చి.

"తమ్ముడూ శ్రీను ఆకతాయిగా తిరుగుతున్నాడు. వాడికి ఓదారి చూపించే బాధ్యత నీది" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంటే తను కాదని ఎలా అనగలడు.

శ్రీనుకి వుద్యోగం దొరకటం ఎంత కష్టమో తనకి బాగా తెలుసు. కాని యేం చెయ్యటం. వానికి తిండికాక ప్రతి రోజూ సాదరు ఖర్చుకి కనీసం ఓ రూపాయి అయినా ఇవ్వాలి లేకుంటే ఇంట్లోని ఏదో వస్తువు మాయమై పోతుంది.

ఆలోచనల్లో మునిగివున్న రామ్మూర్తికి వంటఇంట్లో నించి.

"రండీ" అంటున్న జానకి పిలుపు విన్పించలేదు.

ఇంక లాభంలేదనికాబోలు ప్లేటులో వుప్మాతో తనే వచ్చేసింది తెల్లగా బొద్దుగా వుండే జానకి ప్రసవించిన తర్వాత మరీ సన్నగా అయిపోయింది. కళ్ళు మాత్రం మిలమిలా మెరుస్తూ వున్నాయి. గుండ్రంగా వుండే బుగ్గలు లోతుకి వెళ్ళిపోయాయి.

'అయ్యో జానకీ ఇప్పుడే ఇలాగైతే ముందు ముందు ఇంకా ఎలా అయిపోతావో' వాపోయింది అతని హృదయం.

"నాలుగువేలు కట్నం ఇచ్చి మీవాళ్ళు పెళ్ళిచేస్తే చివరికి కడుపునిండుగా అన్నం కూడా పెట్టలేకపోతున్నాను గదూ! యేవీ నీచేతులు అంట్లు తోమి తోమి ఎంత మొద్దు బారి పోయాయో?" అంటు జానకి చేతిని తన రెండు చేతుల తోనూ దగ్గరగా తీసుకొని నోటిదగ్గర పెట్టుకున్నాడు.

"ఏం పిచ్చిమాటలు. ఇది నా సంసారం వీళ్ళంతా నా వాళ్ళు మీరు నా సర్వస్వం కేవలం డబ్బే సుఖాన్ని ఇస్తుందా? లేదు, అనుకూలుడైన భర్త. పండంటి కొడుకు నా కింకేం కావాలి! మీ చల్లని మనస్సులో నన్ను దాచు కుంటే అదేచాలు నాకింకేమీ వద్దు, మరేం వద్దు."

సంతృప్తి నిండిన కళ్ళతో అంటూవుప్మా తీసి అతని నోటికి అందిస్తుంటే రామ్మూర్తి కళ్లల్లో నీళ్లు తిరిగినా నోట్లోని వుప్మా మింగేస్తు,

"జానకీ నీకు బాధ కల్గించే పని ఒకటి చేశాను. చెప్పిం తర్వాత నన్ను క్షమిస్తావా?"

"ఛ... అవేం మాటలు మీరు బాధ్యత కలిగినవారు?"

"ఏం చేసిన బాధ కల్గదు చెప్పండి."

రామ్మూర్తి గొంతులోని వుప్మా మింగుడు పడటం లేదు.

మెల్లగా అన్నాడు

"స్కూటర్ కోసం నీవు దాస్తున్న డబ్బులోనించి కొంత తీసి రాముకి పరీక్ష ఫీజు కట్టాను. నాచేతులో ఏం లేదు. ఇలా కాస్త కాస్త అంతా ఖర్చు అయిపోయింద"

నీవు యే కోరికాకోరలేదు కోరిన ఒక్క "కోరికా" నేనీ జన్మలో తీర్చలేనేమో తలపట్టుకున్నాడు రామ్మూర్తి

జానకి గుండె ద్రవించిపోయింది.

"ఎందుకంత బాధ పడతారు! ఏదో తెలియక చాలా సార్లే అడిగాననుకోండి అప్పటికి మనస్థితి అర్థం కాలేదు. అదీకాక అప్పటి జానకికి బాధ్యతలు తెలియవు. ఇప్పుడు అలాంటి కోర్కెలని కోరే మూఢురాలు కాదు ఈ జానకి. మన ఇద్దరం కాకుండా మూడోవాడు మురళితయారైనాడు. ఇప్పుడు స్కూటర్ ఎక్కి మీ వెనక కూర్చుని అలా అలా షికారు వెళ్ళాలనే కోర్కె నాకు లేదు. దయచేసి మరెప్పుడూ బాధ పడద్దు"

జాలిగొలిపే కళ్ళతో అన్నది.

"నీవు అడిగినా అడక్కపోయినా నీ కోరిక యెప్పటికైనా తీర్చటానికి ప్రయత్నిస్తాను." అంటూ జానకిని దగ్గరకు లాక్కుంటే అతని గుండెమీద వాలి పోయింది.

"ఈ సామ్రాజ్యానికి మహారాణివి. నాకు మరింకేం కావాలి"

"ఎంత అదృష్టవంతుడివి" గుండెలకి హత్తుకున్నాడు రామ్మూర్తి

ఇంతలో ఉయ్యాల్లోని మురళి "కయ్యి" మంటూ ఏడుపు లంకించుకున్నాడు. జానకి భర్త చేతులనించి తప్పించుకుని కొడుకుని తీసుకోవటానికి లేచింది.

ఇలాగే సంవత్సరాలు దొర్లిపోయినాయి.

# 4

జానకి జానకమ్మ అయింది.

నలుగురు ఆడపిల్లలు. అన్నపూర్ణ, సుందరి, భాను, రేఖా. మగపిల్లలు మురళి, రాము, విశ్వం, సీను. పిల్లలు పెరిగి పెద్ద అయినారు గాని రామ్మూర్తికి జీతం మాత్రం చాలి నంత పెరగలేదు. పెద్ద కూతురు అన్నపూర్ణ మాత్రం పెళ్ళి కెదిగింది.

పక్క-ఇంట్లో కాపురం ఉన్న కామాక్షి కూతురు పెళ్ళి యెంతో ఘనంగాచేస్తుంటే జానకమ్మ తన కూతురికి ఇంతగా కాకున్నా శక్తి ఉన్నంతలో చెయ్యగలనా. అసలు కలసి వస్తుందా! మేమిచ్చే రెండువేలకట్నానికి ఏలాంటి వాడు వస్తాడో అని దిగులుపడిపోయింది. రామ్మూర్తి మాత్రం ప్రయత్నించి ఓ సంబంధం తెచ్చాడు ఆనందరావు బి. ఏ. టెంప్రరీ ఉద్యోగం మాత్రమే. అన్నపూర్ణని చూడగానే ఈ అమ్మాయినే చేసుకుంటానని పట్టుపట్టటం ఆనందరావు తల్లిదండ్రులకి ఖాయం చేసుకోక తప్పలేదు.

ఇంత ఇవ్వలేను అని రామ్మూర్తి మొత్తుకున్నా మధ్య వర్తులు మూడువేలూ, లాంఛనాలూ అంటూ అయిదువేల వరకూ దేకించారు.

పెళ్ళి జరుగుతోంది. కాని రామ్మూర్తి గుండె జారి

పోయింది. ఈ అప్పు ఎలా తీర్చడం? రెండో దాని పెళ్ళి ఎలా చెయ్యను? అని.

అల్లుడు అలకపాన్పుమీద స్కూటర్ కావాలంటు న్నాడు." రావయ్యా ఇస్తానని చెప్పు అంటూ రామ్మూర్తి పినతండ్రి రంగనాధరావు.

"అల్లుడికి స్కూటర్ కావాలి, ... నాలుగు వేలు పెట్టినా వస్తుందా అల్లుడి కోర్కె ఖరీదు నాలుగువేలు. తను కలలో కూడా "వూ" అనలేడు. ఆడపిల్ల ఇది ఒక్కతే కాదు.

నల్లరాయిలాగా మాట్లాడని రామ్మూర్తిని మందలిం చాడు పినతండ్రి.

"అవతల అప్పగింతలకి టైమవుతూంటే ఏమిటీ ఆలశ్యం "వూ" అనరా!

"బాబాయ్. నీ ఉద్దేశ్యం ఏమనీ" గాభరా పడ్డాడు రామ్మూర్తి రంగనాథం నవ్వేస్తూ పిచ్చినాయనా వుండు వస్తా.

"ఆ అలాగే ఇస్తాడు లెమ్మనండి అల్లుడిని" అంటూ కేక పెట్టి తిరిగి రామ్మూర్తి దగ్గరగా వచ్చి.

నీ వియ్యంకుడు వున్నాడే ఆ గెజిటెడ్ ఆఫీసరు "అబ్బాయికి ఆఫీసు దూరం. డాక్టర్ సైకిల్ అసలే తొక్క వద్దన్నాడు" అంటూ కొడుకు అవసరాన్ని సమర్థిస్తున్నా డయ్యా.

అసలు ఈ పెద్దమనిషి అన్నం తింటున్నాడా! ఇంత కట్నం పోసినా అబ్బాయికి బి. ఎ. డిగ్రీ టెంప్రరీ వుద్యోగ్యం

తలదాచుకునేందుకు ఓ గది అన్నా స్వంతం అంటూ లేదు. పిల్లకి చిన్న మెత్తు బంగారం అన్నా పెట్టలేదు. అదీ ఇదీ అని అలిగి ఇప్పటికే చాలా వదిలించారు. అసలు "ఆశ"కి అంత నేది ఉన్నదా అంట. ఒక్క పిల్ల పెళ్ళిచేస్తే "చిప్ప" పట్టుకో వాలిలాగా వుంది"

"అబ్బబ్బ అదంతా సరే ఈరోజు ఇస్తానన్నారు ఇచ్చి తీరాలి" అని పేచీకి దిగితే. అసలే ఆడపిల్లని ఇచ్చు కున్న వాళ్ళం"

బాధతో గొంతు బిగుసుకుపోయింది రామ్మూర్తికి.

"ఒరే మూర్తీ ఇంత సత్యసంధుడవైతే మిగతా పిల్లల పెళ్ళి ఎలా చెయ్యగలవూ .... ఒక్కటి గుర్తు వుంచుకో. ఆ పని జరిగిపోవటానికి ఏదో అన్నామే అనుకో అయినా మాట ఇచ్చింది నువ్వు కాదు నేను, సరేనా" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయారు ఆయన.

రామ్మూర్తి అక్కడే కూలబడి పోయాడు.

తను జీవితంలో ఎంత సంపాదిస్తున్నా ఖర్చులకే సరిపోక మనస్సులోని "కోరిక"లని అథఃపాతాళంలోనికి అణగదొక్కే సుకుని బాధ్యతల బరువుతో సతమతమవుతూంటే ఇంక అల్లుడి కోరిక తీర్చే సామర్థ్యం తనకెక్కడిది?

## 5

ఇద్దరూ లేక ముగ్గురూ అంటూ ప్రభుత్వమూ ప్రజా నీకమూ హోరెత్తిపోయేటట్లు ప్రచారం చేస్తూ జనాభాని

తగ్గించేందుకు కృషి చేస్తున్నారు ఇప్పుడు. ఆ నాడు అంటే పదిహేను ఇరవై సంవత్సరాల క్రితం సంతాన నిరోధక సాధనాలు ఇంత అందుబాటులో లేవు. ఇవి ఉపయోగిస్తే ఎలాంటి అపాయమూ లేదు అని తెలియని సంధియుగంలో తనలాంటి వాళ్ళు ప్రకృతి సిద్ధమైన సృష్టిని నిరోధించలేకపోయారు.

"తర్వాత తర్వాత తెలుసుకుని మనం కూడా జాగ్రత్త తీసుకోవాలి" అనుకుంటూ ఉండగానే అప్పటికే ఆరుగురు పిల్లలు. "సమయం మించిపోతోంది" అనుకుని డాక్టరు సలహా తీసుకుని ఆపరేషను కానిచ్చేసరికి పిల్లల సంఖ్య ఆరునించి ఎనిమిదికి దేకింది.

"నేను చాలా ఆలస్యం చేశారా" అన్న ప్రశ్న తల యెత్తినప్పుడల్లా ఒక విధమైన వుదాశీనత ఆవరిస్తుంది.

"ఏం జీవితం! పరుగు పందెం కాస్తయినా విశ్రాంతి చిక్కితే కదూ గతాన్ని తలుచుకుని భవిష్యత్తుని గురించి ఆలోచించటానికి. అంతా యాంత్రికంగా గడిచి పోతున్నాయి, కాలచక్రం గిరగిరా తిరిగేస్తోంది. సామాన్య మానవుడు సమస్యలతో నలిగిపోతున్నాడు. జానకి పోరుపెట్టి బలవంతంగా డాక్టరు దగ్గరికి పంపకుంటే ఈపాటికి పదిదాటి వుండేదేమో భగవాన్. ఇప్పటికైనా మమ్మల్ని దయతలిచావు.

ఇదే సంతృప్తి ఆ దంపతులకి.

అన్నపూర్ణ అత్తవారింటికి వెళ్ళింది. ఆ యిల్లు ఒక మహా సత్రంలాంటిది. ఇంటి యిల్లాలు హాయిగా పెద్ద కోడ

లికి ఇల్లు వదిలి ఎదిరింటి డాక్టరుగారి భార్యతో పేకాటతో కాలక్షేపం కానిస్తూ వుంటుంది.

ఆ సంసారంలో యే ఖర్చు సంగతీ ఆవిడకి అక్కర లేదు. నెలకి వందరూపాయలు ఆవిడకి పాకెట్ మనీ ఇవ్వాలి సిందే. ఆవిడ జిల్లా జడ్జిగారి కూతురు. అందుకే ఆవిడ ఏ నాడూ కుర్చీ దిగదు. ఆవిడ కూతురు పెళ్ళిచేసి పంపినా అత్తగారు వంట చెయ్యమన్నదని కోపంతో పుట్టింటికి వచ్చేసి అమ్మ ప్రక్కన మరో కుర్చీ వేసుకుంది.

ఈమె కొత్త సినిమా "రిలీజు అయిందంటే బ్లాకులో అయినా సరే టికెట్ కొని వెళ్ళితీరాలి. నాగేశ్వర్రావు పార్టీ గనక. రామారావు పార్టీ వాళ్ళతో మాటలతోనే యుద్ధం చేస్తుంది. వీలుంటే రోడ్డుమీది పోష్టర్ల మీద పేడ కొట్టి వస్తుంది. అది ఆవిడ హాబీ.

ఇంక అన్నపూర్ణ మామగారు చాలా సాధువు రిటై రైనా ఏదో ప్రైవేట్ కంపెనీలో పనిచేసి నెలకి రెండువందలు తెస్తున్నాడు. ఇంక మరిది 'కులం ఏదైనా సరే బాగా డబ్బు గల అమ్మాయి వస్తేనే పెళ్ళి చేసుకుంటా, ఆ డబ్బుతో అమె రికా వెళ్ళి వస్తా' అంటూ ఆ రోజు కొరకు ఎదురు చూస్తు చదువు బి.యస్సీ. మధ్యలోనే తిలోదకాలు వదిలి "ఆవారా" లాగా తిరుగుతూ ఉంటాడు.

ఇంక ఆ యింటిని భరించేది పెద్దకొడుకూ కోడలూ.

అన్నపూర్ణ భర్త ఆనందరావూ బాధ్యతలు వదిలి హక్కుల కోసం పోరాడేరకం అని తెలుసుకుంది. లేకుంటే పండగకి సూటు కుట్టించలేదని అంతగా నోరు చేసుకుంటాడా.

అన్నపూర్ణ కాపురానికి వచ్చిందేగాని అంతా అసంతృప్తే. ఏం మొగుడు, ఏం సంసారం. ఒక్కళ్ళకీ సంబంధం ఉన్నట్లు ఉండరు. ఎవరి ఖర్చులు వారివి. ఎవరి సంపాదన వారిది. "అబ్బ, వద్దు హాయిగా నాన్నదగ్గరే ఉండి ఏదైనా ఉద్యోగం చేసుకుంటూ ఉంటే నాన్నకీ, అమ్మకీ సహాయపడుతున్నాననే సంతృప్తి అన్నా మిగులుతుంది' అని ఆలోచిస్తూ ఉంటుంది.

తన భర్తకి యెప్పుడూ డబ్బు. ఎవరన్నా సరే ఇస్తే ఖర్చు చెయ్యడానికి ఫస్టు. ఆనందరావు అన్నపూర్ణని అవకాశం వచ్చినప్పుడల్లా పుట్టింటి విషయం యెత్తి గేలిచేస్తూనే ఉంటాడు. "మీ నాన్న కాలర్ చిరిగిన షర్టులు వేసుకుంటారు. అమ్మ వంటమనిషిలా ఉంటుంది. మీ తమ్ముడు ఎప్పుడూ రూపాయి టికెట్టుకే సినిమాకి వెడతాడు. అతను మా బావమరిది అని చెప్పుకోవాలంటేనే సిగ్గు" ఇలా ఏదేదో అంటూనే ఉంటాడు. భర్త దగ్గర కాస్త చనువు యేర్పడి, మాటకి మాట జవాబు ఇచ్చేపాటి శక్తి వస్తూండగానే అన్నపూర్ణకి నెల తప్పి ఏడోనెల వచ్చేసింది.

జానకమ్మ వియ్యపురాలికి ఇరవై రూపాయల చీర తెచ్చిందని కోపం వచ్చి విసిరికొట్టి -

"మర్యాదా మన్నా తెలియని మీలాంటి పీనాసి వాళ్ళని చేసుకోవటం మాదే పెద్ద పొరపాటు" అంటూ గుంజుకుంది వియ్యపురాలు.

"ఇదిగో పూర్ణా... ఇన్ని రోజులూ మీ నాన్న స్కూటర్ ఇస్తాడు ఇస్తాడు అని వూరుకున్నాను. నేను అసలే మంచి వాడినికాను. తెలుసుగా! వెళ్లు, వెళ్ళి పండంటి బాబుతో సహా స్కూటర్ కూడా కొనిపించి మరీ తీసుకురా. నాకూ కష్ట సుఖాలు తెలుసు. అందుకే సెకండ్ హాండ్ అయినా ఫర్వాలేదు. గుర్తు వుంచుకుంటావుగా! మరోమాట. బాబే కావాలి. జాగ్రత్త" అంటూ వీడ్కోలు ఇచ్చిన భర్త ముఖంలోకి నిర్లిప్తంగా చూసింది అన్నపూర్ణ.

"గొంతెమ్మ కోర్కె తీరే విధానం ఎలా? ..."

"అమ్మాయి పుట్టినా స్కూటర్ తేకున్నా రావటానికి వీల్లేదు" అని చెప్పకనే చెప్తున్నాయి అతని కళ్ళు.

'ఏం మనుష్యులు? వీళ్ళు సంస్కార వంతులు. నాగరికత వీళ్ళ సొత్తు. అబ్బ, ఇది నాగరికతే అయితే నాకు వద్దు...' అనుకుంది అన్నపూర్ణ. కోడలు పుట్టింటికి వెళ్ళబోతూంటే అత్తగారికి తల యెత్తిచూసే టైమ్ లేదు.

అన్నపూర్ణని తీసుకుని వాకిట్లోకి వస్తూంటే, కిరాణా కొట్టువాడూ బట్టల కొట్టువాడూ పెద్దగా అరుస్తూ లోపలికి వచ్చేశారు.

"తొమ్మిది వందల్లో ఒక్క నయాపైసా వసూలు వెయ్యలేదు, మూడు నెలలనించీ. ఇలాగైతే మర్యాద దక్కదు" అంటూ "ఏదో పెద్దమనుషులనీ కొడుకు లిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు కదా, ఇవ్వకబోతారా అని అప్పు ఇచ్చాను. ఆరువందలు పైన అయినాయి. డబ్బు అడుగుతున్నానని మీ ఆయన సందుల్లో నించి దాటుతున్నాడు. ఏందమ్మా! ఇస్తారా లేదా?" అంటూ కిరాణాకొట్టువాడు.

"మీ అత్తగారు యాభై రూపాయలకి తక్కువ ఖరీదు చీరె కట్టనంది పాపం. ఇదా సంగతీ" అంటూ విస్తు పోయింది జానకమ్మ.

"అవన్నీ మనకెందుకమ్మా, వెళ్ళిపోదాం" అంటూ మురళి తొందరపెట్టి తీసుకు వెళ్ళిపోయాడు.

# 6

రెండో కూతురు సుందరి. స్కూలు ఫైనలు పూర్తి చేసి "కటింగ్" "ఎంబ్రాయిడరీ" వగైరా నేర్చుకుని సంవత్సరం పైనుంచి ఇంట్లో కూర్చుంది. 'నేను ఉద్యోగం ఏదైనా చేస్తానమ్మా, వూరికే కూర్చుంటే బోర్‌గా ఉంది. అంటూంది సుందరి.

"వద్దుతల్లీ, ఉద్యోగం చేసే పిల్లలకి ఇంక పెళ్ళి అయేది కష్టం, ఈ రోజుల్లో, చూస్తూనే ఉన్నాంగా" అంటుందే గాని మనస్సులో దిగులు "అసలు దీని పెళ్ళి చెయ్యగలమా" అని.

రామ్మూర్తి సంబంధాలు వెతుకుతూనే వున్నాడు.

"స్కూలు ఫైనలు పాసైతే అయిదు వేలు, పట్టభద్రుడైతే ఎనిమిది. చెప్పు దేనికి తూగగలవు" అంటాడు పెళ్ళిళ్ల పేరయ్య పెళ్ళికొడుకులలిస్టు తిరగేస్తూ. అయిదు వేలు ఎనిమిది వేలు ... ఎక్కడ్నించి తేవాలి అంతడబ్బు. సంపాదించే విధానం చచ్చినా అర్థం కాదు. అవకాశం ఉన్నా అంత రాత్మ

ఒకటి ఉన్నదే. దీన్ని నోరు నొక్కేది యెలా? ఇప్పుడే ఇలా అంటే మూడోదీ, నాలుగోదీ అంటూ ప్రశ్నించింది మనస్సు.

'అన్నింటికీ ఆ భగవంతుడిదే భారం' నిర్లిప్తంగా జవాబిస్తే, 'చేతకానివాళ్లు అనవేసిన మాటలవి. దేవుడు అందమైన అల్లుళ్ళని తీసుకువచ్చి నీ వాకిట్లో వదులుతాడు చూస్తూ ఉండు' అంటుంది పరిహాసంగా అంతరాత్మ.

నువ్వు నోరు మూసుకు పడివుండు, గద్దించి కళ్ళు గట్టిగా మూసుకున్నా మనశ్శాంతి ఉండదు రామ్మూర్తికి.

పొరుగింటి మీనాక్షి రెండో కూతురు పెళ్ళి కూడా అయిపోయింది. బ్రహ్మాండంగా చేశారు అని మెచ్చుకున్నారు ఇరుగూ పొరుగూ.

సుందరి ఎదురింటి కాలేజీ కుర్రాడిని అస్తమానం కిటికీలోనించి చూస్తుండటం గ్రహించిన జానకమ్మ మనస్సు కోపంతో వుడికిపోయింది! చాచి చెంపలు పగల కొట్టాలన్నంత కోపమే వచ్చింది. కాని వాళ్ల తప్పు ఏం వుంది. వయస్సులోని పిల్లలు ఏం చేస్తారో వాళ్ళకే తెలియదు. సూటిగా చెప్తే బాధపడుతుంది. భర్తతో చెప్తే మండిపడి కూతురు మీద నోరు పారేసుకుంటాడేమో అని బాధ. లోలోపల మింగలేక ఒకరోజు మెల్లగా సుందరిని మందలించింది.

"తప్పమ్మా, ఎవరన్నా చూస్తే ఏమనుకుంటారు." అని.

సుందరి ఏడవటం తప్ప మరేం చెప్పలేదు. రేఖ మాత్రం అక్క పుస్తకాల్లో దొరికిందని ఓ కవరు యిచ్చింది తల్లికి.

జానకి పై ప్రాణం పై నేపోయింది. తనకి తెలియకుండా ఈ ఇంట్లో ఇంత గ్రంథం నడుస్తోందా! నెత్తీ నోరూ కొట్టుకుంది.

ఏం చెయ్యటం, మన బంగారం మంచిది కావాలి. బైటవాళ్ళని అని ప్రయోజనంలేదు.

అసలే నీరసంగావున్న జానకమ్మ తిండీ, నిద్రాలేక కళ్ళుతిరిగి పడిపోయింది. జ్వరం, పరాకు మాటలూ.

ఆ జ్వరంలో "తల్లీ సుందరీ ... తప్పమ్మా ..." అంటూ ఏదేదో గొణిగింది. ఏమిటో అర్థంకాని రామ్మూర్తి పెద్దకూతురివైపూ, మురళివైపూ చూసినా ఏమని చెప్తారు.

ఎవ్వరూలేని సమయంలో సుందరి తల్లిదగ్గర చేరింది, సంతతధారగా ప్రవహించే కన్నీటిని తుడుచుకుంటూ.

"అమ్మా ... నే నిప్పటికేమీ పొరపాటు చెయ్యలేదు. తెలియక ఉత్తరం రాశాను అంతేనమ్మా.... మళ్ళీ ఎప్పుడూ చెయ్యను, చెయ్యను" అంటూ మంచంకోడికేసితల కొట్టుకుంది.

"తల్లీ ఏడవకు. నాకు తెలుసమ్మా, నువ్వు పరిస్థితులను అర్థంచేసుకోగలవు. అమ్మ మాటకి విలువ ఇవ్వగలవు తల్లీ. ఇంక నాకేమీ విచారంలేదు." అంటున్న తల్లి చేతుల్లో తన ముఖం దాచేసుకుంది సుందరి.

# 7

భార్య పోరు పడలేక సంబంధాలు వెతుకుతున్నాడు. ఆడపిల్ల పెళ్ళికి ప్రభుత్వం యిచ్చే లోను రెండువేలూ తీసుకున్నాడు. కాని ఇదేం సరిపోతుంది.

ఇప్పటికే జీతం చాలక అవస్థపడుతూంటే జీతంలో ఈ అప్పులకి మరికొంత 'కట్' పోతే ఎలా బ్రతకటం. మురళి చదువు ఎప్పటికి పూర్తిగాను; ఎప్పటికి ఉద్యోగం దొరుకును ? మా రెక్కకి ఎప్పటికి సహాయపడును. అన్నపూర్ణకి పురుడూ పుణ్యం ఇవన్నీ వుక్కిరిబిక్కిరి చేస్తుంటే ఈ దొరగారికి యీ రోజుకిసినిమా కావలసి వచ్చిందేమిటీ.

ఆలోచిస్తూ అలాగే కూర్చుంది జానకమ్మ.

"జానీ ఇంకా అలాగే కూర్చున్నావా ? టైము ఆరు దాటింది- తెలుసా !"

అంటూ హడావుడిగా వచ్చాడు రామమూర్తి. కాలర్ పూర్తిగాపోయిన షర్టు, కాలిదగ్గర పీచులు వ్రేలాడుతున్న పాంటూ, సగం నెరిసిన తలా, ఆలోచనలతో అలసటగా కన్పించే కళ్ళూ- భర్తనే చూస్తూ వుండిపోయింది జానకమ్మ.

"ఓయ్ .... నిద్రపోతున్నావా, సినిమాకి వెళ్ళాలి. లే... లే..." అంటూ పట్టుకుని కుదిపాడు.

జానకమ్మ గడియారంవైపు చూసింది. ఆరూ పది హేను.

"సినిమాకి తీసుకు వెళ్ళాలన్న పెద్దమనిషి ఇప్పుడేనా రావటం" అంది కోపం ముంచుకురాగా.

"నీ ముఖం. వెళ్ళటం ఎంతసేపు. త్వరగా రెడీ అయితే సరిగ్గా ఆరు నిమిషాలు. అంతే. త్వరగా టిఫినూ లేకుంటే వట్టి కాఫీ ఇలా తేమ్మా అన్నపూర్ణా" అంటూ పెద్ద కూతురిని కేకవేస్తుండగానే సుందరి కాఫీతో ప్రత్యక్షమయింది.

అంతవరకూ అక్కడక్కడా ఆడుకుంటున్న చిన్న పిల్లలుపరుగెత్తుకొచ్చి "నాన్నారూ, సైకిల్ మోటారు మనదేనా ? కొనుక్కొచ్చారా" అంటూ తండ్రిని చుట్టుకున్నారు.

"నీకు తెలియదు. మనదేనట. అన్నయ్య చెపుతున్నాడు"

"మరి పాతదిగా వుందేం! తోస్తేగాని 'గుడుగుడు' అంటూ పోవటంలా.

"నల్లగావుంది. జయావాళ్ళది ఎంచక్కా పచ్చగా వుంది"

"పోనీలే నీ వెక్కెకు. నేనూ, అన్నయ్యా ఓ రౌండ్ కొడతాం" అంటూ పరుగెత్తుబోయి,

"నాన్నారూ.... మనదేకదూ" అంటూ రెట్టించి మరీ అడిగారు ఏక కంఠంతో.

"అవునర్రా మనదే.... మనదే ..." అంటూ ఆమోమయంగా చూస్తున్న భార్యవంక వోరగా గర్వంగా చూస్తుంటే నాలిక చుర్రుమంది.

"అబ్బ, ఇంతవేడిగా వుందేమిటి ?" కప్పులోది కాస్త తొణికి షర్టుమీదపడింది. అయినా అతనికి కోపం రాలేదు.

మనదే అన్న తండ్రిమాట వింటూనే మరోసారి వాకిట్లోకి పరుగుతీశారు.

"మాదే మాదే" నాన్నారు కొన్నారు. అంటూ వీధి వీధీ చెప్పేస్తున్నారు" అడిగిన వాళ్ళకీ, అడగని వాళ్ళకీ.

అప్పుడప్పుడూ స్నేహితుల స్కూటర్ నడపటం నేర్చుకున్న మురళి సినిమామాట మర్చి తమ్ముళ్ళనీ, చెల్లాయినీ ఓ ట్రిప్ వేసి తీసుకువచ్చి దించుతున్నాడు. అరుగుమీద 'క్యూ' పెద్దదవుతోంది. నేను నేనంటూ గల్లంతుచేస్తున్నారు పిల్లలంతా.

పిల్లలంతా వాకిట్లో వుండటంతో గదిలో భార్యాభర్తలిద్దరే మిగిలిపోయారు.

"స్కూటరు .... మీరు .... కొన్నారా ? ఎప్పుడు కొన్నారూ, ఎలా కొన్నారూ"

"ఊ .. నేను కొన్నాను. నిన్ను వెనక కూర్చోపెట్టుకుని సినిమాకి తీసుకు వెళ్ళబోతున్నాను. తెలుసా. జానీ, అసలు నీకు కూర్చోవటం వస్తుందా అని." పెద్దగా నవ్వేస్తూ మళ్ళీ అన్నాడు.

"నీకేంభర్వాలేదు. నన్ను గట్టిగాపట్టుకో ఎంతస్పీడుగా నడపగలనో చూద్దువుగాని. వూ"

సంతోషంతో వూగిపోతున్నాడు రామ్మూర్తి.

జానక్కి చిత్రంగావుంది. ఇదంతా నిజమే! కలకాదు గదా.... ఏమిటో భర్త మరోమాట మాట్లాడనీయక "త్వరగా తయారవమంటూ" వుంటే.

"నాకు ఒక్కమాటా చెప్పకుండా ఎలా కొన్నారబ్బా...."

నిజానికి తనకీ సంతోషంగానే వుంది. గబగబా ముడి చుట్టి, చుట్టూ మల్లెపూలదండ పెట్టుకుని తయారయింది.

జానకమ్మ భుజంమీద ఓ చెయ్యి వేసి తల దువ్వుకుంటున్న రామ్మూర్తి వులిక్కిపడ్డాడు. తల్లోనే కాదు, మీసంలోకూడా పండిపోయి, వెంట్రుకలు బాగా కన్పిస్తున్నాయి.

లాభంలేదు. చాలా పెద్దవాడినయ్యాను. జీవితంలో ఏ కోరికలూ తీరకుండానే బాధ్యతల బరువు అధికంకాగా వాటి నిర్వహణలో కాస్తయినా విశ్రాంతి చిక్కకుండానే జీవితం పడమరకి తిరిగింది అవును. ఇది గుర్తువుండబట్టే ఇక ముందు అసలే లాభంలేదని ధైర్యంచేసి జానకి కోరిక, ఇరవై సంవత్సరాల తర్వాతన్నా కొనేశాడు. ఈ కోర్కె తన జీవిత సహచరి ఒక్కదానిదే కాదు, తనదికూడా.

తర్వాత ఏం జరిగినా సరే అంతే.

జానకమ్మ ముస్తాబు పూర్తి అయి దగ్గరగా వచ్చింది.

"జానీ...ఎంత బాగున్నావూ! పద ఇద్దరం అలా అలా గాలిలో తేలిపోదాం. ఈ సంసార సాగరంనుంచి ఓ రెండు గంటలు బైటకి వెళ్ళి చుట్టూ ప్రపంచం ఎలా వుందో చూద్దాం."

జానకమ్మ మరోసారి అద్దంలో చూసుకుని-

"సరే పదండి, మరీ స్పీడుగా పోవద్దు. నాకు చాలా భయం. అదీకాక పిల్లలందరూ చూస్తూ మీ వెనక కూర్చోవటానికి సిగ్గుగావుంది బాబూ. ఓ పని చెయ్యండి. ముందు స్కూటర్‌తో మీరు వెళ్ళి అలా రోడ్డుమీద నిల్చోండి. సందు మలుపు తిరిగి సుమా, ఆ తర్వాత నేను అక్కడికి వస్తాను. సరేనా."

పగలబడి నవ్వాడు రామ్మూర్తి. ఆ నవ్వుతో మరీ సిగ్గుతో మొగ్గ అయిపోయింది జానకమ్మ.

"మరీ ఇంత సిగ్గయితే ఎలా. దారిలో ఎవరన్నా తెలిసిన వాళ్ళు కన్పిస్తే కొంపతీసి క్రిందకి ఉరకవు కదా ! ప్రమాదం సుమా"

"నాకు తెలుసు ఆ మాత్రం. అసలే మన ఇంటి పక్కన మీనాక్షీ వాళ్ళాయనా సినిమాకి వెళ్ళారు. ఒకవేళ దారిలో కన్పిస్తారేమో. ఇదిగో చెపుతున్నాను వెనక కూర్చుంటా కాని మీ భుజంమీద చెయ్యి వెయ్యను-అంతే" అంది.

"ఆ పప్పులు ఉడకవ్. నామీద చెయ్యి వెయ్యాలి సిందే. ఎన్నో సంవత్సరాలకు ఈనాడు నాకల నిజం అవుతూంటే నువ్వు పాడు చెయ్యవద్దు."

"అంతగా కలలుకన్నారా" నవ్వుతూ చూసింది భర్తవైపు.

కాదు, అమ్మాయిగారి కలలు ... ఊహు జానకి కల నెమరువేసుకుంటూ" దగ్గరగా వచ్చేశాడు.

"వూ... దూరంగా వుండాలి. పిల్లలు వస్తూపోతూ వుంటారనేది కాస్తకూడా గుర్తువుండదు." అర్థగజం దూరం తోసేసింది.

"వాళ్ళంతా స్కూటర్ మోజులో వున్నారులే. ఈ ఒక్కరోజూ నా మాటవింటే ఇంక ప్రతిరోజూ నీ ఆజ్ఞ శిరసావహిస్తాను ఒక్కటంటే ఒక్కటి...వూ.." ముందుకి తలవంచాడు రామ్మూర్తి.

"ఈరోజు మరీ ఇంత బరితెగించా రేమిటీ?" చిరు కోపంతో అన్నది జానకి.

"తెగించాం ..వారించి ప్రయోజనం లేదు." అంటూ రెండు చేతులతోనూ జానకమ్మని దగ్గరికి లాక్కుని,

"జానీ, ఈ చిన్నకోర్కె తీర్చటానికి ఇరవై సంవత్సరాలు పట్టింది. ఇప్పటికైనా వీలు అయిందా! చాలా సాహసమే చేశాను. దీని పర్యవసానం ఏం జరిగినా ఈ క్షణం నీ ముఖంలో కన్పించే సంతృప్తి నాకు కావాలి. దాన్ని నేను తృప్తితీరా చూడాలి. చూసి హాయిగా గాలి పీల్చుకోవాలి. తెలుసా జానీ" ఆవేశంగా అంటున్న భర్త కళ్ళల్లోకి ఆప్యాయంగా చూస్తూ "ఇంతకీ ఎలాకొన్నారో చెప్పనేలేదు." అంది.

ఎన్నెన్నో ఆలోచనలు అప్పటికే జానకి బుర్రలో "గిర్రు"న తిరుగుతూంటే "ఈ డబ్బు ఎక్కడిది? ఎలా వచ్చింది" అన్న ఆలోచనకి జవాబు దొరకటంలేదు జానకమ్మకి.

"ముందు స్కూటరుమీద సినిమాకి వెళ్ళివచ్చి ఆ తర్వాత చెప్తాను."

"ఉహూ....ముందు చెప్పండి, ఆ పైన వస్తాను."

ఇంక లాభం లేదు-చెప్పేయాలి.

"సుందరి పెళ్ళికోసం తీసుకున్న అడ్వాన్సు డబ్బుతో.... మరో వెయ్యి ఆఫీసులో "

ఇంక వినేస్థితిలో లేదు జానకమ్మ.

"ఎంతపని చేశారూ. అదే చాలదని...మిగతాది ఎలా తేవాలని ఆరాటపడుతూంటే ... మీ కలాంటిపని చెయ్యటానికి ఎలా మనస్కరించింది! అయ్యో, పిల్లపెళ్ళి ఎంత త్వరగాచేస్తే అంత మంచిదని చెవిన ఇల్లు కట్టుకుని పోరుతున్నానే. ఇంకా ఎలా చెప్పను" కళ్ళవెంట నీళ్ళు సుళ్ళు తిరిగాయి జానకమ్మకి.

"జానీ, అందుకే నీకు చెప్పనన్నాను. నా ఆనందం పాడు చెయ్యకు. పద వెడదాం" చెయ్యి అందించాడు రామ్మూర్తి.

"రాను. రాలేను. నాకీ సంతోషం వద్దు. నాక్కావలసింది పిల్లపెళ్ళి," వెక్కి వెక్కి ఏడుస్తూంది.

రామ్మూర్తిలోని హుషారు నీరుగారి పోయింది. భార్యకి నచ్చచెప్పాలని ఆ డబ్బు ఎలాగూ చాలదు. ఆ విషయం అలా వుంచు. మనం జీవితంలో ఏం సుఖపడ్డాం. బాధ్యతలు నిర్వహించటంతో మనస్సులోని కోరికలని మట్టిలో కలిపేసుకున్నాం. వయస్సు పైబడుతోందేగాని తిరిగిరాదుగా నేను సంపాదిస్తున్నాను; నువ్వు యంత్రంలా పని చేస్తున్నావు. కాని మనకంటూ మిగిలింది ఏమిటి? అందుకే ఎంతో ఆలోచించే చేశాను జానకీ, విచారపడకు. పైన భగవంతుడు

వున్నాడు. రా వెడదాం. నా సంతోషం సగం హరించి పోయింది. నా సంతోషం నీ కక్కరలేదా జానీ, చెప్పు."
అంటూ జానకమ్మ ముఖం రెండుచేతుల్లోకి తీసుకుంటూ వుంటే ఆ చేతుల్లో తన ముఖాన్ని దాచేసుకుంది జానకమ్మ.

దీర్ఘమైన నిట్టూర్పు విడుస్తూ, "దీనికంతకూ నేనే కారణం కదూ !"

"కాదు, కానేకాదు జానకీ! ఇది నా కోరికకూడా ! బయటికి చెప్పనుగాని నాలోనూ బోలెడు కోర్కెలు వున్నాయి. పిల్లలందరినీ తీసుకుని నీతో కారులో షికారుకి వెళ్ళాలనీ, ప్రతి సినిమా చూడాలనీ, మురళిని ఫారెన్ పంపాలనీ సుందరికి పదివేలు కట్నంయిచ్చి పెళ్ళిచేయాలనీ ఇలా ఎన్నెన్నో ! ఆగ్రా వెళ్ళి నిండు పున్నమిరోజు తాజ్‌మహల్ అందంచూస్తూ నీతో కబుర్లుచెప్తూ పరవశించి...."

"ఆగండి."

సడన్‌'బ్రేక్' పడ్డట్లు ఆగిపోయింది రామ్మూర్తి వాక్ప్రవాహం.

"చూడండి, ఈ కోరికలనే గుర్రాల పగ్గాలు మన చేతుల్లో వుంచుకోకపోతే చివరికి అవి మనని ఎక్కడికి లాక్కువెళ్ళి పారేస్తాయో తెలుసా ? సామాన్యమైన సంసారం, చాలీచాలని రాబడి, ఎనిమిదిమంది పిల్లలు, వీళ్ళకి సరైన తిండీ, గుడ్డా ఇలాటి కనీస అవసరాలు తీర్చటానికే సతమత మవుతున్నాం. ఆ పైన చదువులూ, పెళ్ళిళ్ళూ ఈ బాధ్యతలని సక్రమంగా నిర్వహించటానికి ప్రయత్నించాలా ? భవిష్యత్తులో వాళ్ళు మనలా కాక సుఖంగా బ్రతకటానికి బాటలు వేయాలా !"

"నా కవన్నీ తెలియవూ !"

"తెలుసు. తెలిస్తే మళ్ళీ ఇలా మన కోరికకోసం ఇంత డబ్బు ఎందుకు ఖర్చుచేస్తారు ? అనే నేను అడుగుతున్నాను. పోనివ్వండి అయిపోయిందిగా, సుందరిని ఉద్యోగంలో చేర్పించండి. స్కూటర్ వాపస్ ఇచ్చేసి ఆ డబ్బు 'బ్యాంక్'లో వేస్తే ఈ లోపల ఎలాగో అలా మరికాస్తవేసి సుందరిపెళ్ళి కానిద్దాం. భగవంతుడు కరుణించి మంచి సంబంధం దొరక్కపోతుందా !

మనం ముందు జాగ్రత్త తీసుకోకుండా ఈ కరవు రోజుల్లో ఎనిమిదిమంది పిల్లలని కన్నందుకు కోరికలని తగ్గించుకుని చేసిన తప్పుకి మరోతప్పు చెయ్యకుండా బిడ్డల భవిష్యత్తు తీర్చిదిద్దుదాం. నిజంగా నన్నడిగితే మనం ఇద్దరం ఈ శిక్ష అనుభవించాల్సిందే ! ఏమంటారు ?"

గది బైటనించి ఇదంతా వింటున్న అన్నపూర్ణ తత్తరపడిపోయింది-'ఏమైనాసరే నాన్నను అడగను. ఆయన ఇంట్లోకి రానిచ్చినా సరే, లేకున్నా సరే' గట్టిగా అనుకుంది భర్త కోరిక గుర్తుకురాగా.

తల్లిదండ్రులు తమరిద్దరి అవసరాలూ, కోరికలూ అలాగ అవతలికినెట్టి పిల్లల భవిష్యత్తుకోసం బంగారుకలలు కంటున్న తల్లిదండ్రులకి మనస్సులోనే నమోవాకాలు అర్పించి వెనక్కి తిరిగింది. సుందరి తలవంచుకుని తన గదిలోకి వెళ్ళిపోయింది.

తమ్ముడు సరదా పడుతున్నాడని ఒకసారివచ్చి సినిమాకి వెడుతున్నానని చెప్పబోయి అంతలోనే ఆ అభిప్రాయాన్ని మార్చుకుంటూ, అయిదురూపాయలు ఎంత విలువైనవి. అంతగా చూస్తే 'రష్' తగ్గింతర్వాత ఒక్క రూపాయితో చూడవచ్చు. వెళ్ళకున్నా ఫర్వాలేదు. ఏమైనా రెండు టికెట్లు చూసుకుంటే నాన్నగారికి కాస్త బరువు తగ్గించినవాడిని అవుతాను' అనుకుంటూ ఆ కాగితాన్ని అన్నపూర్ణ చేతులోపెట్టి "అమ్మకివ్వు అక్కా, అలా షికారుకి వెళ్ళివస్తా. త్వరగావచ్చి చదువుకుంటానులే" అంటూ వెళ్ళిపోయాడు తల్లి, తండ్రీ సంభాషణవిన్న మురళి.

రామ్మూర్తి క్రాఫ్‌లోకి వేళ్ళుపోనిచ్చి ఆలోచిస్తున్నాడు.

"మీ ఆనందాన్నంతా పాడుచేశాను కదూ!"

"లేదు జానకీ, బాధ్యతని సమయానికి గుర్తుచేశావు. తల్లిదండ్రులుగా మనకర్తవ్యాన్ని నిర్వహిస్తే దానిలోకూడా మఃకి ఆనందం లభిస్తుంది. అయితే నాకు అనే స్వార్థం వదిలేస్తేనే!" నీ ఇష్టప్రకారమే చేస్తాను దిగులుపడకు."

జానకి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"ఎంత అదృష్టవంతురాలిని" ఆనందబాష్పాలు పమిటతో అద్దుకుంది.

"నాన్నాలూ అన్న నన్ను ఎక్కించటంలా" అంటూ చివరి ముగ్గురుపిల్లలూ తండ్రికి ఫిర్యాదుచేస్తూ వచ్చారు.

"అన్నయ్యని కోప్పడతాలే. నేనే మిమ్మల్ని తిప్పి తీసుకువస్తా. ఈ ఒక్కరోజుకేగా... రండి" అంటూ రెండు చేతులతోనూ ఇద్దరినీ పట్టుకుని వాకిట్లోకి వెడుతున్న భర్తనే చూస్తూ వుండిపోయింది జానకమ్మ.

[—( )—]